


# తిలా పాపం... తలా పిడికెడు...

పి. హైమావతి

"ఇవ్వాళ అటో ఇటో తేలిపోవాలి...వెయ్ బాసూ!" అన్నాడు నీలకంఠం హుషారుగా మిత్రులవంక చూస్తూ.

వారానికోసారి తన మిత్ర బృందంతో ఇలా క్లబ్బులో పేకాడు తూంటాడు నీలకంఠం. ఆ క్లబ్బులో సామాన్యుల కెవరికీ సభ్యత్వం దొరకదు... అందరూ పెద్ద పెద్ద పొజిషన్స్‌లో ఉన్న

వారే చేరుతూంటారక్కడ. నీలకంఠం ఆ నగరంలో పేరు మోసిన సర్జన్స్‌లో ఒకడు.. అతనికున్న ఏకైక బలహీనత పేకాట! వారంలో ఆరు రోజులూ ఊపిరి సలపకుండా పనిచేసి...రెండు చేతులా డబ్బు సంపాదించే నీలకంఠం.. ఆదివారం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ హాస్పిటల్ ఛాయలకు కూడా వెళ్ళడు.

ఆ కండీషన్ మీదే డాక్టర్ సంపత్ నర్సింగ్ హోమ్‌లో జాయిన్ అయ్యాడు. నీలకంఠం లాంటి ఎఫిషయంట్ సర్జన్ తమ నర్సింగ్ హోమ్‌లో పనిచేయడం అంటే... అది తమ నర్సింగ్ హోమ్‌కి ఎంతో ప్రెస్టేజిగా భావించే డాక్టర్ సంపత్...నీలకంఠం కండీషన్‌ని ఎప్పుడూ బ్రేక్ చేయలేదు.

ఆదివారం తన భార్యా బిడ్డలను తీసుకొని ఏదో చోటికి వెళ్ళి సాయంత్రం దాకా ఆనందంగా గడిపి వస్తూ ఉంటాడు. సాయంత్రం వారిని ఇంట్లో దించేసి... ఫ్రెష్ అప్ అయి లైట్‌గా టిఫిన్ చేసి రాత్రి ఏడు గంటలకల్లా క్లబ్బుకు వచ్చేస్తాడు... క్లబ్బు మూసే వరకూ పేకాడుతూ జోక్స్ కట్ చేసి అందర్నీ నవ్విస్తూ... వారం రోజుల పని భారాన్నీ దించేసుకుని అర్ధరాత్రి దాటాక ఇంటికి వెళ్తాడు... తాను క్లబ్బుకు వస్తున్నప్పుడే సెల్‌ని ఇంటి దగ్గర వదిలెయ్యడమో, ఆఫ్ చేసి జేబులో వేసుకోవడమో చేస్తూంటాడు... ఎమర్జెన్సీ కేసు అని ఎవరైనా డిస్టర్బ్ చేస్తారనే ఉద్దేశ్యంతో.

డాక్టర్ నీలకంఠం కంపెనీ అంటే చక్రవర్తికి ఎంతో ఇష్టం... అందుకే మిగతా రోజుల్లో క్లబ్బుకి వచ్చినా, మానినా... ఆదివారం మాత్రం విధిగా క్లబ్బుకి వస్తూ ఉంటాడు, నీలకంఠం చెప్పే కబుర్లు వినడం కోసం.

''ఇవ్వాళ మా హాస్పటల్‌లో ఏం జరిగిందో తెలుసా?'' అన్నాడు నీలకంఠం పేక కలుపుతూ.

అందరూ ఆసక్తిగా నీలకంఠం వైపు చూశారు ఏం జరిగింది అన్నట్లుగా...

''ఈ మధ్యే కొత్తగా పెట్టిన ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ వాళ్లు మా హాస్పటల్‌కి వచ్చారు... వాళ్లు వచ్చారని తెలియగానే ఎంతో బిజీగా ఉన్నట్లు నటిస్తూ ఓ అరగంట కూర్చోబెట్టి... ఆ తర్వాత లోపలికి పిలిపించాడు సంపత్. పాపం వాళ్లంత సేపూ ఓపికగానే వెయిట్ చేశారు. వాళ్ల ప్రొడక్టును మార్కెటింగ్ చేసేందుకు కొత్తదారి కనిపెట్టారు వాళ్లు... సంవత్సరానికి ఇన్ని లక్షలని టార్గెట్ పెట్టుకున్నారు. దాన్ని మేము రీచ్ చేస్తే మా హాస్పటల్‌కి గిఫ్టుగా మారుతీ వేన్‌ని ఇస్తామన్నారు. అంటే వచ్చే ప్రతి పేషెంట్‌కీ విధిగా వాళ్ల మందులే రాయాలన్న మాట... అవసరం ఉన్నా, లేకున్నా...

అదిగాక మేము ఎన్ని బాక్సులు మెడిసిన్స్ సేల్ చేస్తే అన్ని బాక్సుల మెడిసిన్స్ ఫ్రీగా ఇస్తారట! ఈ లెక్కన ప్రతి నర్సింగ్‌హోమ్‌కి అనుబంధంగా ఉండే మెడికల్ షాపులన్నిటినీ వీళ్ల మందులతో నింపేస్తారన్న మాట... అవి పని చేస్తాయా, లేదా అన్నది వేరే సంగతి... ఇలా ఫ్రీ గిఫ్టులు, వన్‌ప్లస్ వన్ ఆఫర్లూ ఇస్తున్నారంటే ఆ మెడిసిన్స్‌లో ఎంత పవర్ ఉంటుందో తెలుస్తూనే ఉంది. వాళ్లకెంత లాభం లేకపోతే ఇలా ఫ్రీ గిఫ్టులు ఇస్తారూ? పాపం... ఇలా ప్రజల ప్రాణాలతో మేమూ, వాళ్లూ కలిసి చెడుగుడు ఆడేస్తున్నామన్న మాట!'' అన్నాడు నీలకంఠం.

''ఇదేం కొత్త విషయం కాదులే బాసూ! మందుల కంపెనీలతో చాలా వాటితో నాకు డిస్ట్రిబ్యూటర్‌గా చాలా సంబంధాలున్నాయి... ఇలాంటి చమక్కులు ఎన్ని చేస్తామో నీకేం తెలుసు? కొన్ని కొన్ని కంపెనీలయితే పెద్ద పెద్ద పేర్లతో ప్రకటనలిస్తూ... ఓ చిన్న బిల్డింగ్‌ను అద్దెకు తీసుకొని బల్క్‌గా పెద్ద కంపెనీల నుండి డ్రగ్స్ కొనుగోలు చేసి... దానికి సూటయ్యే చాక్ పౌడర్ లాంటి పౌడర్లను అందులో మిక్స్ చేసి పేకింగ్ చేసి కంపెనీ లేబిల్స్ అంటించేస్తారు. వీటన్నిటికీ ఓ లక్ష రూపాయలు ఖర్చు పెట్టి... దాన్ని పది లక్షల సరుకు కింద బజారులోకి విడుదల చేస్తారు. అంటే వాడు పెట్టిన ప్రతి రూపాయికి తొమ్మిది రూపాయలు లాభం సంపాదిస్తున్నాడన్నమాట. అలాంటపుడు సగానికి సగం ఫ్రీగా ఎందుకివ్వడు? ఆ పైన ఫ్రీ గిఫ్టులు లాంటివి ఎన్ని ఇస్తే మాత్రం వాడికి పోయేదేముంది?

పెద్ద పెద్ద పేరున్న కంపెనీలు జ్వరానికీ, దగ్గుకీ, జలుబుకి ఇతర నొప్పులకూ పది రూపాయలకిచ్చే మందులను వీళ్లు ఐదు రూపాయలకే మార్కెట్‌లోకి దించుతారు... అది పని చేస్తుందా లేదా అన్నది వేరే సంగతి. చౌకగా వస్తుంది కనుక కొంత మంది డాక్టర్ల దగ్గరకు పోకుండా మెడికల్ షాపు వారి నడిగి ఆ మందులే కొని పట్టుకెళ్తూంటారు... ఇలా ప్రజల అవసరాన్నీ అమాయకత్వాన్నీ తెలివిగా కేష్ చేసుకొని తమ అమ్మకాలు పెంచుకుంటున్నారు'' అన్నాడు చక్రవర్తి.

నకిలీ మందులు తయారు చేస్తున్న ఓ కంపెనీ యజమాని కూతురు... డాక్టరు ప్రిస్కైబ్ చేసిన ఆ మందులనే వాడి ప్రాణాలు పోగొట్టుకుంది... వాడి వేలితో వాడి కన్నే పొడుచుకున్నట్లయింది.. అయినా ఇలాంటి వారికి బుద్ధి రాదు!

''మరి పేరున్న కంపెనీలన్నీ కలిసి వాళ్ల మీద కేసు పెట్టవచ్చు కదా!'' అన్నాడు కేశవమూర్తి.

''మొత్తానికి లాయరువనిపించావయ్యా... మన దేశంలో కోర్టుల్లో కేసులు ఎంత తొందరగా తేలుతాయో తెలియనిదా? ఈలోగా కోర్టుల చుట్టూ తిరిగి డబ్బునీ సమయాన్నీ వృథాగా ఖర్చు చేయడమే కాదు. తన వ్యాపారాన్ని కూడా మూల పెట్టే పరిస్థితి వస్తుంది... తెలివైన వ్యాపారస్తుడు ఎప్పుడూ ఇలా కోర్టుల చుట్టూ తిరుగుతూ టైమ్ వేస్టు చేసుకోడు. తన సేల్స్ పెంచుకునేందుకు మరో ప్రత్యామ్నాయాన్ని వెతుకుతాడు. అంతేకాదు... ఈ కంపెనీలన్నింటికీ ఓ కట్టుబాటు, వ్యాపార నీతి ఉన్నాయి. అదేంటంటే... ఎన్ని సమస్యలు వచ్చినా తమలో తాము పరిష్కరించుకుంటారు తప్ప కోర్టుల కెక్కరు.

ఆ పైన మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు ఇన్సెంటివ్‌లు ఇస్తారు. డాక్టర్లను కానుకలతో ప్రలోభపెడ్తారు... తమ మందులే ప్రిస్కైబ్ చెయ్యమని. మాలాంటి డిస్ట్రిబ్యూటర్లతో మరో రకంగా ఎక్కువ మార్జిన్లు ఇస్తామని బేరాలాడతారు... ఇదిగాక బిల్స్ లేకుండా బేక్ డోరులో స్టాకంతా రిలీజ్ చేసి బిల్లు రూపంగా ప్రభుత్వానికి చెల్లించే టాక్సులను ఎగ్గొట్టి మరింత లాభాలను ఆర్జిస్తారు. ఏది ఏమైనా ఈ నాసిరకం మందుల వలన పోయేది ప్రజల ప్రాణాలేగా... వాళ్లదేం పోతుంది?'' అన్నాడు చక్రవర్తి బాధగా.

''మరి ఇన్ని తెలిసిన వాడివి... ఈ మెడిసిన్స్ డిస్ట్రిబ్యూషన్‌నే ఎందుకు ఎంచుకున్నావు?'' అన్నాడు కేశవమూర్తి.

''ఏం చేయను? బ్రతకాలిగా మరి... అయినా నేను కాకపోతే మరో గొట్టాంగాడు ఇదే పని చేస్తాడు తప్ప ఇదేమన్నా ఆగుతుందా? తప్పూ, అన్యాయం అని అందరికీ తెలుసు... అయినా ఎవరూ దీన్ని ఆపలేరు... ఎవరి బాధ వారిదే... ఇదో విషవలయం!'' అన్నాడు చక్రవర్తి.

''తెలిసిన వాళ్లే ఇలా అనుకుంటే ఇక తెలియని వాళ్ల గుర్చి చెప్పేదేముంది? ఆ మధ్య పేపర్లో ఓ సంఘటన పడింది గుర్తుందా? ఇలా నకిలీ మందులు తయారు చేస్తున్న ఓ కంపెనీ యజమాని కూతురు... డాక్టరు ప్రిస్కైబ్ చేసిన ఆ మందులనే వాడి ప్రాణాలు పోగొట్టుకుంది... వాడి వేలితో వాడి కన్నే పొడుచుకున్నట్లయింది.. అయినా ఇలాంటి వారికి బుద్ధి రాదు!'' అన్నాడు కేశవమూర్తి నిరసనగా.

''అందుకే కదా... మన దేశంలోని పెద్ద పెద్ద వాళ్లంతా వేలి మీద కంతి మొలిచినా ఫారిన్ వెళ్లి కట్ చేయించుకొస్తున్నారు... ఇక్కడి డాక్టర్ల మీదా మందుల మీదా వాళ్లకెంత గురో పాపం! అందుకే ఇక్కడ ఎంతో కష్టపడి చదివే డాక్టర్లంతా... ఈ దేశంలో మనుగడ లేదంటూ విదేశాలకు వలస వెళ్లిపోతున్నారు. మనం, మన దేశ ప్రజలు.. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఇలా అజ్ఞానంలో మగ్గిపోవలసిందే, ఏ సదుపాయమూ లేకుండా....'' అన్నాడు నీలకంఠం ఉద్రేకంగా.

ఇలా ఓ ప్రక్క కబుర్లాడుతూనే... మరో పక్క ఆట కంటిన్యూ చేస్తున్నారంతా.

ఆట మంచి పట్టులో ఉండగా, చక్రవర్తి సెల్ మ్రోగింది. టాక్ బటన్ నొక్కి ''హలో!'' అన్నాడు చక్రవర్తి.

''హలో, చక్రవర్తిగారేనా మాట్లాడేది?'' అని ఆదుర్దాగా అవతలి కంఠం వినిపించడంతో...

''అవును, చక్రవర్తినే మాట్లాడుతున్నాను... ఇంతకూ మీరెవరు?'' అనడిగాడు చక్రవర్తి, మాట్లాడుతున్నది ఎవరో అర్థంగాక. ''నేను అమృతా హాస్పటల్ నుండి డాక్టర్ సంపత్‌ను మాట్లాడుతున్నాను'' అనడంతో...

''ఓ మీరా.. గుడీవెనింగ్ సార్... ఏమిటిలా ఫోన్ చేశారు?'' అనడిగాడు చక్రవర్తి.

''ఆ,గుడీవెనింగ్... ఏం లేదు, మీ పక్కన డాక్టర్ నీలకంఠం గారున్నారా? ఆయనతో అర్జంటుగా మాట్లాడాలి'' అన్నాడు సంపత్.

''ఆ, ఉన్నారు... జస్టేమినిట్!'' అంటూ సెల్ ఫోన్‌ని నీలకంఠానికి అందిస్తూ ''బాసూ, నీకేఫోను!'' అన్నాడు చక్రవర్తి.

''ఏంటి బాసూ ఇది...రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం తప్పదన్నట్లు ఇక్కడికీ ఫోన్లేనా?'' అంటూ విసుగ్గా ఫోను అందుకొని ....''హలో!'' అన్నాడు నీలకంఠం.

"సారీ బాసూ... నిన్నిబ్బంది పెడ్తున్నాను. మీ ఇంటికి ఫోన్ చేస్తే మీ మిసెస్ నువ్విక్కడ ఉంటావని చెప్పారు. ఎన్నిసార్లు నీ సెల్‌కి రింగ్ చేసినా రెస్పాన్స్ లేదు. అందుకని మళ్లీ మీ మిసెస్‌కి రింగ్ చేసి...చక్రవర్తిగారి నెంబరు తీసుకున్నాను... విషయం ఏమిటంటే మన హాస్పిటల్‌కి ఓ యాక్సిడెంట్ కేసు వచ్చింది... వాళ్లు కాస్త ఇల్లిటరేట్స్‌లా ఉన్నారు. కానీ మంచి సౌండు పార్టీలా ఉన్నారు... ఎలా లేదన్నా ఓ పాతిక, ముప్పై వేలన్నా లాగొచ్చు... నువ్వర్జంటుగా మన హాస్పటల్‌కి వచ్చెయ్యి!" అన్నాడు సంపత్ ఉత్సాహంగా.

"ఏంటి బాసూ ఇది? ఆదివారం నాడైనా నన్ను ఫ్రీగా వదలవా ఏమిటి? ఇక్కడ ఆట మంచి రసకందాయంలో ఉంది... నా హేండ్ మంచి రైజ్‌లో ఉంది... గతవారం నేను పోగొట్టుకున్న అయిదువేలకి జతగా మరో అయిదన్నా సంపాదించాలని టార్గెట్ పెట్టుకున్నానీ రోజు...." అంటున్న నీలకంఠం మాటలను మధ్యలోనే ఆపేశాడు సంపత్....

"ఆదివారం గనకే మన పంట పండిందంటున్నాను బాసూ... ఇంతకు ముందెప్పుడైనా నిన్ను ఇలా ఇబ్బంది పెట్టానా చెప్పు? పోనీ... నీ టార్గెట్‌ను నేను పూర్తి చేస్తాను గానీ, వెంటనే రా బాసూ, ఆలస్యం చేస్తే గోల్డెన్ ఛాన్స్ మిస్సయి పోతాము... పార్టీ చెయ్యి జారిపోతుంది" అన్నాడు సంపత్ తొందర పెడ్తున్నట్లుగా.

"ఇంతకీ ఏమిటట ట్రబుల్? ఏమైనా ఫ్రాక్చర్సా? ఇంజురీసా? టెస్టులు చేయించావా అసలు? అతని బ్లడ్ గ్రూప్ అదీ వెరిఫై చేశావా?" అని అడిగాడు నీలకంఠం.

"ఇంకా టెస్టులేవీ చేయించలేదు బాసూ.... నువ్వొచ్చేసరికి ఆ పనులన్నీ పూర్తి చేయిస్తాను... ప్రస్తుతానికి ఫస్టెయిడ్ జరిగిందంతే, ఈ లోగా బేరసారాలు..." అంటున్న సంపత్‌ని మధ్యలోనే కట్ చేస్తూ...

"మరి టెస్టులవీ లేకుండా, సర్జరీ అవసరముందో లేదో చూడకుండా... నేనెందుకయ్యా అక్కడికి?" అన్నాడు విసుగ్గా.

"ఇదిగో... అవన్నీ ఫోనులో చెప్పడానికి కుదరదు కానీ, ముందు నువ్వు రావయ్యా... ఈ లోగా మేమిక్కడ సిట్యుయేషన్ కాస్తంత ప్రమాదకరంగా ఉందన్నట్లుగా క్రియేట్ చేస్తాము" అంటూ ఫోన్ కట్ చేశాడు సంపత్.

"రాక ఛస్తానా?" అంటూ సెల్ ఆపి చక్రవర్తికిచ్చి... చేతిలో పేకని విసుగ్గా టేబిల్‌పై పడేసి "సారీ ఫ్రెండ్స్... మీటగైన్ నెక్ట్స్ సండే!" అంటూ అయిష్టంగా లేచాడు నీలకంఠం.

"ఒకే... ఇట్సాల్‌రైట్!" అంటూ సాగనంపారు మిత్ర బృందం.

నీలకంఠాన్ని చూడడంతోనే... "వచ్చావా...రా... పేషెంట్ కండీషన్ చూద్దువుగానీ" అంటూ తీసుకువెళ్ళాడు సంపత్.

సంపత్‌తో వచ్చిన నీలకంఠాన్ని చూడడంతోనే పేషెంట్ తాలూకా బంధువులంతా ఒక్కసారిగా పెద్ద పెట్టున ఏడుస్తూ... "డాక్టరుగారూ... మా వాడిని మీరే రక్షించాలి" అంటూ చుట్టుముట్టారు.

"ఆగండమ్మా, మీరంతా ఇలా డాక్టరుగారిని చుట్టుముట్టేస్తే... ఆయనింక పేషెంట్‌నెలా చూస్తారు చెప్పండి? తప్పుకోండి" అంటూ నీలకంఠానికి దారి చేశారు.

సంపత్ ఇచ్చిన ఎక్స్‌రేని ఒకసారి పరిశీలించి చూసి ఇచ్చేశాడు నీలకంఠం. మోటార్ సైకిల్ యాక్సిడెంట్ వలన దెబ్బలు బలంగానే తగిలాయి. ఒక కాలు మైల్డ్‌గా ఫ్రాక్చర్ అయింది తప్ప మిగతా దెబ్బలేవీ ప్రమాదకరమైనవి కావు... యాక్సిడెంట్ వలన కలిగిన షాక్ వలన పేషెంట్ అపస్మారకంగా ఉన్నాడు తప్ప ప్రమాదకరమైన పరిస్థితేం కాదు. కాకపోతే దెబ్బల వల్ల ఒళ్ళంతా రక్తసిక్తమై చూపరులకు భీతి గొల్పుతోంది... అసలు సర్జరీ చేయవలసిన అవసరమే కనిపించలేదు నీలకంఠానికి.

పేషెంట్‌ను పరీక్షిస్తున్న నీలకంఠం పక్కకి వచ్చి నిల్చున్నాయన... "డాక్టరుగారూ... ఎంత డబ్బయినా ఫర్వాలేదు, నా కొడుకును బ్రతికించండి చాలు.. మీ పేరు చెప్పుకొని మా ఇంట్లో రోజూ దీపమెట్టుకుంటాం" అన్నాడు రెండు చేతులూ జోడిస్తూ.

"బాబూ, డాక్టరు బాబూ! ఈడు నా మనవడు బాబూ... వొంశానికొక్కడే వరపెసాదంలా మిగిలాడు... భారమంతా మీదే బాబూ!" అంది వృద్ధురాలు రుద్ధకంఠంతో మనవడి వంకే దిగులుగా చూస్తూ.

"అయ్యా, డాక్టరుగారూ... నీట ముంచినా, పాల ముంచినా మీదే భారం బాబూ, నా కొడుకు మునుపటిలా నాతో మాటాడితే చాలు!" అంది పేషెంట్ తల్లి కన్నీళ్లతో రెండు చేతులూ ఎత్తి దండం పెడుతూ.

"అంత ఆదుర్దా పడవలసిందేం లేదమ్మా..." అని అంటున్న నీలకంఠాన్ని మధ్యలోనే ఆపేస్తూ.. "చెప్పాను కదమ్మా! పెద్ద డాక్టరు గారి చేతిలో పడ్డాక మీ అబ్బాయి ప్రాణాలకు ఏ ఢోకా ఉండదనీ... ఆయన యముడితో పోరాడైనా... నీ కొడుకును నీ కప్పగిస్తారు చూడు... బోయ్స్, ఆపరేషన్ థియేటర్ రెడీ చేయడం పూర్తయిందా? పేషెంట్‌నక్కడికి వెంటనే షిఫ్ట్ చేయండి" అన్నాడు సంపత్ హడావిడి పడిపోతూ.

అదంతా చూశాక ఇక ఏమనడానికీ నోరు రాక. సంపత్‌ని అనుసరించాడు నీలకంఠం. సరిగ్గా ఆపరేషన్ థియేటర్ లోకి అడుగు పెట్టే ముందు... అయిదు సంవత్సరాల పాపను చేతుల మీద ఎత్తుకొని కన్నీళ్లతో వచ్చారా దంపతులు...చూడ్డానికి కూలీ నాలీ చేసుకునే వారిలా ఉన్నారు...

"డాక్టరు బాబూ... నా బిడ్డను కాపాడండి. మద్యాన్నం నుండి ఎగూపిరిగా ఉన్నాది... మా ఇంటి దగ్గర డాట్రుగారికి చూపిస్తే ఇరవైనాలుగ్గంటల నొప్పనీ... ఎంటనే ఆప్రేషను చెయ్యాలన్నారు... ఎలాగన్నా నా బిడ్డను మీరే కాపాడాల!" అంది ప్రాధేయపడుతున్నట్లుగా.

"అయ్యా... నా సెర్మం వొలిసి మీకు సెప్పులు కుట్టిస్తానయ్యా... నా కూతుర్ని రచ్చించండయ్యా!" అంటూ సంపత్ కాళ్లు పట్టుకున్నాడా బిడ్డ తండ్రి.

"ఏంటయ్యా ఇదీ? ఇదేమన్నా ధర్మాసుపత్రి అనుకుంటున్నావా? వెళ్లవయ్యా, వెళ్లు... జనరల్ హాస్పటల్‌కి వెళ్లు" అన్నాడు సంపత్ చీదరించుకుంటున్నట్లుగా.

"అయ్యా... అక్కడికెల్తే మమ్మల్నెవరూ పట్టించుకోలేదయ్యా... అక్కడున్న కాంపౌండ్రే చెప్పాడు, మీ దగ్గర కెల్తే... ఎంటనే ఆప్రేశన్ చేస్తారని... ఇదిగోనయ్యా నా తాలిబొట్టు, ఇది తీసుకొని నా బిడ్డను బతికించయ్యా... మిగతాది నీ ఇంట్లో పాసిపని చేసుకునన్నా తీర్సుకుంటాను" అంది ఆమె.

ఆ మాటలతో కరిగి పోయిన నీలకంఠం... "సంపత్ ఆ పాపకు ముందు ఆపరేషన్ చేసేద్దాం... ఆ తరువాత అతని సంగతి చూద్దాం!"అన్నాడు జాలిగా చూస్తూ.

"ఏంటి బాసూ... నీకేమన్నా పిచ్చా? ఈ అలగా వాళ్ల కోసం అక్కడ ఆపరేషన్ లేట్ చేస్తే... నేనింతసేపూ పడిన శ్రమ వృధాయే కదా... వాళ్లు మన మాటలు నమ్ముతారా అసలు? పోనీ నీకంత ముచ్చటగా వుంటే అదయ్యాక... ఆ పిల్లపని చూడు!" అన్నాడు ఉదారంగా.

చేసేదేం లేక..."మరో గంటలో పాపకి ఆపరేషన్ చేస్తాను... అంతవరకూ వేచి ఉండ"మని చెప్పి గోల చేస్తున్న అంతరాత్మ నోరు నొక్కి ఆపరేషన్ థియేటర్ లోకి అడుగు పెట్టాడు.

ఆపరేషన్ ముగించుకొని వచ్చేసరికి ఆ పాప ఇక ఆపరేషన్‌తో పనిలేనట్లుగా... ఈ లోకం నుండి శెలవు తీసుకుంది ఈ సంగతి వాళ్లకి ఎలా చెప్పాలో, ఏమని ఓదార్చాలో తెలియలేదు నీలకంఠానికి. సంపత్



## పీచు పదార్థాలు ముప్పు!

గ్యాస్ట్రిక్ సమస్య ఉన్న చాలామందిలో ఓ అపోహ ఉంది. అదేంటంటే పీచుపదార్థాలు తింటే గ్యాస్ట్రిక్ సమస్య నుంచి దూరంగా ఉండొచ్చని. ఈ కారణంగానే కొంతమంది రాత్రిపూట భోజనానికి బదులు చపాతీలు తీసుకుంటారు. వాస్తవానికి ఇది ఎంతమాత్రం పరిష్కారం కాదు. నార కలిగిన పీచు పదార్థాల వల్ల గ్యాస్ తయారవుతుంది. ఎందుకంటే ఈ పదార్థాల్లో పీచు శాతం ఎక్కువగా ఉండటం వల్ల అవి తొందరగా జీర్ణం కావు. దీంతో జీర్ణాశయంలో ఇవి గ్యాస్‌ను తయారు చేస్తాయి. పైగా అతిగా పీచుపదార్థాలే తీసుకుంటే ఇతర అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు. గ్యాస్ సమస్య ఉన్నవాళ్ళు చిక్కుడు వంటి ఆహార పదార్థాలను తీసుకునేప్పుడు ఒకరోజంతా వాటిని నీళ్ళలో నానబెట్టి కుక్కర్‌లో ఉడికించి తీసుకోవడం మంచిది.

మాత్రం... ''ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లి సర్జరీ చేస్తూండగా పాప చనిపోయిందని చెప్దాము'' అన్నాడు.

కానీ అలా చేసేందుకు మనస్కరించ లేదు నీలకంఠానికి. గాజు కళ్లతో తమ వంకే దీనంగా చూస్తున్న ఆ తల్లిదండ్రుల వంకజాలిగా చూస్తూ జేబులో నుండి చేతికందినంత డబ్బు తీసి పాప తండ్రి చేతిలో పెట్టి వడివడిగా అక్కడి నుండి కదిలాడు నీలకంఠం... అతని చర్యతో జరిగిందేమిటో అర్థమైన ఆ పాప తల్లిదండ్రులు హృదయ విదారకంగా చేస్తున్న రోదనలు నీలకంఠం మనసును కలిచి వేశాయి.

ఎప్పుడూ లేనిది మరునాడు క్లబ్బుకి వెళ్లాడు నీలకంఠం... వెళ్లడమే కాదు. తాను వస్తున్నట్లుగా మిత్రులందరికీ కబురందించాడు '' మంచి మందు పార్టీ ఉంది రండి'' అంటూ.

ఇంకేముంది? మిత్రబృందమంతా ఆఘమేఘాల మీద వాలిపోయారక్కడ.

''ఏమిటి బాసూ, ఎప్పుడూ లేనిది ఇంత భారీ ఎత్తున పార్టీ ఏరేంజి చేశావు?'' అనడిగాడు కేశవమూర్తి.

''ఏముంది...తిలా పాపం... తలా పిడికెడు అని నేను నిన్న సంపాదించిన పాపపు సొమ్ములో మీకూ భాగం పంచుతున్నానంతే!'' అన్నాడు నీలకంఠం.

''అదేంటి బాసూ... ఒక్కసారే అంతమాట అనేశావు? ఏదో కష్టపడ్డావు... నాలుగు డబ్బులు వచ్చాయి. అది పాపపు సొమ్మెలా అవుతుంది?'' అన్నాడు చక్రవర్తి ఆశ్చర్యంగా చూస్తూ.

''కాదా మరి... పాపం, నిజానికి అతనికి ఏ ఆపరేషనూ అవసరమూ లేదు... అతని పేరెంట్స్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దాదాపు నలభై వేల రూపాయలు ఫీజులకీ, టెస్టులకీ, ఎక్స్‌రేలకూ గుంజేసాము... ఇది పాపం కాక మరేమిటి?'' అన్నాడు నీలకంఠం గ్లాసులో ద్రవం గుటకేస్తూ.

''మరి అంత బాధ పడేవాడివి ఈ పాపంలో భాగం పంచుకుంటావెందుకయ్యా? ఏ పల్లెటూరుకో వెళ్లి చిన్న హస్పిటల్ పెట్టుకొని సోషల్ సర్వీసు చేస్తూ హాయిగా కాలక్షేపం చేయక...'' అన్నాడు కేశవమూర్తి.

''ఆ పని చెప్పినంత సులువు కాదు బాసూ... ఇప్పుడు పల్లె ప్రజలు కూడా కార్పొరేట్ హాస్పటల్స్‌కే ఎగబడ్తున్నారు... ఇక్కడ నన్ను పెద్ద డాక్టరుగా గౌరవించిన వీళ్లే... వాళ్ల ఊరు వెళ్లి చిన్న క్లినిక్ పెడితే అసలు లెక్క చేయరు... అక్కడ పది రూపాయలకు మందులు రాసి వారి రోగాలు తగ్గిస్తామన్నా నమ్మకం కుదరదు. ఇక్కడికి వచ్చి అవసరమున్నా లేకపోయినా వందలూ, వేలూ ఖర్చు పెట్టి అన్ని రకాల టెస్టులూ చేయించుకొని... మూడు నాలుగు రకాల మందులు రాయించుకొని తృప్తిగా ఇంటికి వెళ్తారు... మరి లోపమెక్కడుందో అర్థం కాదు నాకు. వారి మెంటల్ శాటిస్ఫెక్షనే మా పెట్టుబడిగా మేమిలా డబ్బులు సంపాదిస్తూ ఉంటాము... ఇదో సైకిల్ చైన్ లాంటిది. వాళ్లు అడిగారని మేమూ... మేము దోచేస్తున్నామని వాళ్లూ అనుకోవడమే గాని... ఎవ్వరమూ దీన్ని ఆపే ప్రయత్నం చేయము'' అంటూ గ్లాసు టేబిల్ మీద పెట్టి బిగ్గరగా ఏడవ సాగాడు నీలకంఠం.

ఇప్పటికే తాగినది బాగా తలకెక్కినట్లుంది... మనసు వశం తప్పితే అప్పుడప్పుడూ ఇలా కంట్రోలు తప్పి నీలకంఠం బరస్ట్ అయిపోతూ ఉండడం అక్కడ చేరిన వాళ్లకు కొత్తకాదు.

''అరే, బాసూ... ఏంటిది? కంట్రోల్ యువర్ సెల్ఫ్!'' అంటూ భుజం తట్టాడు చక్రవర్తి.

''లేదు బాసూ... నిన్న నావల్ల పెద్ద పొరపాటు జరిగిపోయింది. డబ్బు వ్యామోహంలో పడి నా వృత్తికే ద్రోహం చేశాను... అస్సలు ఆపరేషన్ అవసరం లేని వాడికి ఆపరేషన్ చేశాను... ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ పసి మొగ్గని... నిర్లక్ష్యంగా నేనే చేతులారా నేలకూల్చాను... ఇంటైమ్‌లో ఆ పాపకి సర్జరీ చేసి ఉంటే ఆ పాప బ్రతికేది బాసూ... వేలాది రూపాయలకు కక్కుర్తి పడి ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాను. ఆ తల్లిదండ్రుల కడుపుల్లో ఆరని చిచ్చు పెట్టాను.

ఆపరేషన్ థియేటర్ ముందే ఆ పాపను ఒడిలో పెట్టుకొని నాకోసం ఆశగా ఎదురు చూసిన ఆ తల్లిదండ్రులకు నేనిచ్చిందేమిటి? వాళ్లిద్దరూ గుండెలు బాదుకొని ఏడుస్తూంటే... చూడలేక పారిపోయి వచ్చాను బాసూ... ఆ తల్లి తన మంగళసూత్రాలను తీసి నా ముందుంచి తన పాపను కాపాడమని వేడుకొంది బాసూ.. నేనెంత తప్పు చేశారు ఈ డబ్బు మైకంలో పడి? ఆ నాడు డాక్టరు పట్టా తీసుకుంటూ నేను చేసిన ప్రతిజ్ఞను గాలికి వదిలేశాను... జబ్బుగా ఉన్నవారికి విచక్షణ మేరకు... నా శక్తి సామర్థ్యాలను వినియోగించి వారికి స్వస్థత చేకూర్చేందుకు పాటు పడతానని... డబ్బుకీ ఇతర ప్రలోభాలకీ లొంగననీ ప్రమాణం చేసి... ఎంత నీచంగా ప్రవర్తించాను నేను?'' అంటూ చేతుల్లో ముఖాన్ని కప్పుకొని ఏడుస్తున్న నీలకంఠాన్ని ఆపేందుకూ, ఓదార్చేందుకూ ఎవరికీ మాటలు దొరకలేదు.

నీలకంఠంలో ఇంకా చావని మానవత్వం... అంతా వ్యాపారమయం అయిపోయిన ఈ విష సంస్కృతితో రాజీ పడలేక అతని అంతరాత్మని నిలదీస్తోంటే... తట్టుకోలేక పోతున్నాడతను.

చక్రవర్తి ఓదార్పుగా నీలకంఠం భుజం తట్టి... ''రిలాక్స్ మై ఫ్రెండ్!'' అన్నాడు అనునయంగా.

★


వచ్చే వారం ప్రారంభం

ఒకటి ఆడుతుంది - ఒకటి పరుగెడుతుంది
ఒకటి నిల్చుని చూస్తుంది - ఏమిటవి?
ఆడేది చేప - పరుగెత్తేది నీరు -
నిల్చుని చూసేది రాయి.

సాదాసీదా పొడుపు కథలే కాదు
సనాతన సంప్రదాయాలను విశ్లేషించే

సంస్కారం